ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 14 మార్చి 2024



2026 నాటికి ఎయిమ్స్ పూర్తి చేస్తాం

● హైకోర్టుకు తెలిపిన కేంద్రం



మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలకు భూమి పూజ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, మార్చి 13: వచ్చే 2026 నాటికి మదురై ఎయిమ్స్ భవన నిర్మాణం పూర్తి చేస్తామని మద్రాస్ హైకోర్టుకు కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. మదురైకి చెందిన కేకే రమేష్... హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో... మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి 2019లో ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేసినా, ఇప్పటి వరకూ అతీగతీ లేదని, మదురై తర్వాత ప్రకటించిన ఎయిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అందువల్ల మదురై ఆసుప్రతి నిర్మాణం నిర్ణీత గడువులో పూర్తి చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని, నిర్మాణాలకు సంబంధించి అసత్య ప్రకటనలు జారీ చేసే అధికారులకు జరిమానా విధించాలని, అలాగే, ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలకు నిధుల కేటాయింపుపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు కృష్ణన్‌కుమార్, విజయకుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్రప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ... మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, 2026 నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలు వచ్చే వారం సమర్పిస్తామని వివరించారు. ఈ వివరాలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. మదురై ఎయిమ్స్ నిర్మాణాలకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి, కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, భారత వైద్య కౌన్సిల్ డైరెక్టర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.





పొల్లాచ్చి సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రాష్ట్రానికి ఏం చేశారని

● దీనిపై మోదీని నిలదీయండి

● ప్రజలకు సీఎం పిలుపు

వరుస పర్యటనలు?

బీజేపీ-అన్నాడీఎంకే మధ్య అక్రమ పొత్తు ● పొల్లాచ్చి సభలో నిప్పులు చెరిగిన స్టాలిన్

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాలక్షేపం కోసం అదే పనిగా రాష్ట్రంలో పర్యటించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి ఏం మేలు చేశారో చెప్పాలని ముఖ్యమంత్రి స్టాలిన్ డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రజలు కూడా నిలదీయాలని పిలుపునిచ్చారు. పదేళ్లుగా ప్రజలకిచ్చిన హామీలను ప్రశ్నించాలని సూచించారు. విదేశాల్లో భారతీయులు దాచిన నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి భారతీయుడి బ్యాంక్ ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందో అడగాలన్నారు. దేశ ప్రజలందరికీ తానే గ్యారెంటీ అంటూ ప్రగల్భాలు చెబుతున్న మోదీ యేడాదికి రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలో బుధవారం ఉదయం ఏర్పాటైన సభలో కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, నీలగిరి జిల్లాల్లో రూ.560కోట్లతో పూర్తయిన 273 ప్రభుత్వ పథకాలను ప్రారంభించారు. రూ.489.53 కోట్లతో చేపట్టనున్న 35 పథకాలకు శంకుస్థాపన చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో 57 వేలకు పైగా లబ్ధిదారులకు రూ.223 కోట్ల సహాయాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... పదేళ్ల అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అధ్వానంగా తయారైందన్నారు. పొల్లాచ్చిలో కాలేజీ యువతులపై సామూహిక అత్యాచారాలు జరిగితే పట్టించుకోలేదని, నేరస్థులు నిర్భయంగా సంచరించారని గుర్తు చేశారు. ఆ సంఘటనపై ఫిర్యాదు చేసిన వారిని బెదిరించారని, డీఎంకే తీవ్ర పోరాటం సాగించడంతో సీబీఐ రంగంలోకి దిగి విచారణ జరిపిందని, త్వరలో నేరస్థులు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కొడనాడు ఎస్టేట్‌లో దోపిడీ హత్య, ఆత్మహత్య, హత్యాయత్నం జరిగినా మునుపటి అన్నాడీఎంకే పాలకులు పెద్దగా పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటును మాజీ ముఖ్యమంత్రి జయలలిత తీవ్రంగా వ్యతిరేకించారని, డీఎంకే ఎన్నడూ వ్యతిరేకించలేదని, ప్రస్తుతం ఆ ఆసుపత్రి నిర్మాణ పనులు భూమిపూజలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. బీజేపీతో తెగదెంపులు చేసుకున్నట్లు ప్రకటించుకున్న అన్నాడీఎంకే నేతలంతా ఆ పార్టీతో రహస్య సంబంధాలు కొనసాగిస్తున్నారని, ఆ రెండు పార్టీల కపట నాటకాన్ని గుర్తించిన ప్రజలు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు సక్రమంగా విడుదల కాకపోయినా తమ ప్రభుత్వం ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. కేంద్రం నిధులు సక్రమంగా మంజూరు చేస్తే రెట్టింపు పథకాలను అమలు చేస్తామన్నారు.

స్టాలిన్ వరాలు...

ఈ సభలో నాలుగు జిల్లాలకు స్టాలిన్ కొన్ని వరాలు ప్రకటించారు. పొలాచ్చిలో కొబ్బరి రైతులకు రూ.2.80 కోట్ల 3 లక్షల కొబ్బరిమొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామని, ఇతర రాష్ట్రాలలో కొబ్బరి వ్యాపారాలు విస్తరించడానికి అనువుగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. సహకార సంఘాల ద్వారా కొబ్బరిని కొనుగోలు చేస్తామన్నారు. విలమరత్తూరు నుంచి అత్తికడవు డ్యాం వరకు 8.29 కి.మీ పొడవున రూ.9కోట్లతో కొత్త రహదారిని నిర్మిస్తామని చెప్పారు. ఈరోడ్ జిల్లాలోని సోలార్ ప్రాంతంలో రూ.20 కోట్లతో కూరగాయల కిరాణా కాంప్లెక్స్ నిర్మిస్తామని, రూ.15కోట్లతో వా.వు.సి. ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తామని, ఈరోడ్ కార్పొరేషన్ పరిధిలో రూ.30 కోట్లతో మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కావేరి వాగు ముఖద్వారాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రూ.6కోట్లతో జిల్లాస్థాయి గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇదే విధంగా తిరుప్పూరు జిల్లాలో పెరుమానల్లూరు రోడ్డులో, నల్లూరులో, బొమ్మనాయకన్‌పాళయం పోయంపాళయం రహదారి వరకు, పిచ్చంపాళయం మెయిన్ రోడ్డు నుంచి రాజానగర్ వరకు రూ.11.50 కోట్ల తో ఫ్లైఓవర్లు, తిరుప్పూరు కార్పొరేషన్‌కు రూ.75 కోట్లతో కార్యాలయాన్ని నిర్మిస్తామని చెప్పారు. నీలగిరి జిల్లాలో ఊటీ బొటానికల్ గార్డెన్‌ను రూ.3 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధిపరచనున్నామని, ఐదు ప్రైమరీ హెల్త్ సబ్‌సెంటర్లు ఏర్పాటు చేస్తామని, ప్రైవేటు భవనాల్లో నడుపుతున్న 10 రేషన్‌షాపులకు కొత్త భవనాలు నిర్మిస్తామన్నారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ముత్తుసామి, సామినాథన్, రామచంద్రన్, ఎం. సుబ్రమణ్యం, కయల్‌విళి సెల్వరాజ్, ఎంపీలు ఎ.రాజా, నటరాజన్, షణ్ముగసుందరం, అందియూరు సెల్వరాజ్, శాసనసభ్యుడు సెల్వరాజ్, మాజీ మంత్రులు కన్నప్పన్, పొంగలూరు పళనిస్వామి, కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



దినకరన్‌ను బీజేపీ కూటమిలోకి ఆహ్వానిస్తున్న అన్నామలై

పది స్థానాలివ్వండి

● బీజేపీకి ఏఎంఎంకే డిమాండ్

ప్యారీస్, మార్చి 13: లోక్‌సభ ఎన్నికల్లో తమకు పది స్థానాలు కేటాయించాలని ఆ కూటమికి నేతృత్వం వహిస్తున్న బీజేపీని 'అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే) అధినేత టీటీవీ దినకరన్ డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఉపాధ్యక్షుడు కరు.నాగరాజన్ తదితర నాయకులతో దినకరన్ మంగళవారం చెన్నైలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏఎంఎంకేకు పది ఎంపీ స్థానాలు కేటాయించాల్సిందిగా దినకరన్ కోరడంతో పాటు తమకు విజయావకాశాలు ఉన్న నియోజకవర్గాల జాబితా సమర్పించారు. అనంతరం దినకరన్ మీడియాతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేసేందుకు ఇష్టపడుతున్న నియోజకవర్గాల జాబితాను బీజేపీ నాయకులకు సమర్పించామన్నారు. ఆ జాబితాను బీజేపీ అధిష్ఠానానికి పరిశీలనకు పంపించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని తనకు అన్నామలై హామీ ఇచ్చారని తెలిపారు. దేశంలో కులమత విద్వేషాలు నశించి సమైక్యత వర్ధిల్లాలన్న ఆకాంక్షతోనే తాము బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం తథ్యమన్నారు. తద్వారా తమిళనాడుకు పలు మంచి పథకాలు వస్తాయని, తమలో ఎవరు పెద్ద అన్న భేదం లేదన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను నమ్మించి డీఎంకే గత లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిందని, అయితే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే ప్రజలకిచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చలేదన్న అంశాలను ప్రచారంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

మైనార్టీ భాషల విద్యార్థులకు శుభవార్త

● టెన్త్‌లో తమిళ పాఠ్యాంశం పరీక్ష నుంచి మినహాయింపు

● వచ్చే యేడాది నుండి నిర్బంధ తమిళమే

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయనున్న మైనార్టీ భాషలకు చెందిన తమిళేతర విద్యార్థులకు శుభవార్త. విద్యార్థులు తమిళ పాఠ్యాంశం పరీక్ష రాయకుండా మినహాయింపు ఇస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 26 నుంచి ప్రారంభమవుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల వరకే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని పేర్కొంది. రాష్ట్ర తమిళ అభ్యాసన చట్టం 2006 సెక్షన్ (3) ప్రకారం 2006 -2007 విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో అంచెలంచెలుగా 1 వ తరగతి నుంచి టెన్త్ వరకు నిర్బంధ తమిళాన్ని అమలు చేయాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం 2015లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు విభాగం -1లో తమిళభాష పాఠ్యాంశం పరీక్ష రాయాలని, తమిళం, ఆంగ్లం మాతృభాషలుగా లేని విద్యార్థులు వారి మాతృభాషని ఐచ్ఛిక పాఠ్యాంశంగా పరీక్ష రాయడానికి అనువుగా విభాగం-4లో పొందే మార్కులు టెన్త్ మార్కుల జాబితాలో విభాగం -4 కింద పేర్కొనాలని, అయితే విద్యార్థుల ఉత్తీర్ణతకు ఆ మార్కులను పరిగణనలోకి తీసుకోవద్దని పేర్కొన్నారు.

అనంతరం జరిగిన పరిణామాల్లో మద్రాసు హైకోర్టు భాషాపరమైన మైనార్టీ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2020 నుండి 2022 విద్యాసంవత్సరం వరకు, అంటే మూడేళ్లకు మాత్రమే విభాగం -1 కింద 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో తమిళ పాఠ్యాంశం పరీక్ష రాయకుండా మినహాయింపు ఇస్తూ తీర్పు వెలువరించింది. ఆ తరువాత సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో భాషాపరమైన మైనార్టీ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2020-22 విద్యా సంవత్సరాల వరకు విభాగం -1 కింద 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో తమిళ పాఠ్యాంశం పరీక్ష రాయకుండా మినహాయింపు పొందవచ్చునని, ఇది 2023 సంవత్సరానికి కూడా వర్తిస్తుందని తీర్పు వెలువరించింది. ఇక భాషాపరమైన మైనార్టీల సమాఖ్య ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రాల్లో కృష్ణగిరి జిల్లాలో తమిళ పాఠ్యాంశం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాకపోవడాన్ని పరిగణనలోకి తీసుకుని, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రెండు నెలల గడువు మాత్రమే ఉన్న పరిస్థితుల్లో ఈ యేడాదికి నిర్బంధ తమిళ పాఠ్యాంశానికి బదులుగా తమ మాతృభాషల్లో పరీక్షలు రాసేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అంతేగాక భాషాపరమైన మైనార్టీ పాఠశాలల్లోని తమిళ టీచర్ల పోస్టులన్నింటిని భర్తీ చేయనున్న పరిస్థితుల్లో మైనార్టీ భాషలను అభ్యసించే విద్యార్థులకు 2025 విద్యాసంవత్సరంలో జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో తమిళ పాఠ్యాంశం పరీక్ష రాయకుండా మినహాయింపును కోరే ప్రసక్తే ఉండదని రాతపూర్వకమైన హామీ (అండర్‌టేకింగ్స్) ఇచ్చారు. రాష్ట్ర మైనార్టీల సమాఖ్య నిర్వాహకుల విజ్ఞప్తిని, వారి హామీని, పాఠశాలల విద్యాశాఖ సంచాలకుల ప్రతిపాదనను పరిశీలించిన మీదట ప్రభుత్వం అంగీకరించి రాష్ట్ర తమిళ అభ్యాస చట్టం 2006 సెక్షన్ 5 ప్రభుత్వానికి కల్పించిన విశేషాధికారం ప్రకారం త్వరలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయనున్న మైనార్టీ భాషలను మాతృభాషగా కలిగిన విద్యార్థులు విభాగం -1 కింద నిర్బంధ తమిళ పాఠ్యాంశం పరీక్ష నుంచి మినహాయింపు కోరే విద్యార్థులకు మాత్రమే వారి మాతృభాష పాఠ్యాంశం పరీక్షను విభాగం-1 కింద రాయడానికి అనుమతించవచ్చని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి జె.కుమార గురుబరన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఓపీఎస్‌కు పార్టీతో ఎలాంటి సంబంధాలు లేవు

● రెండాకుల గుర్తుపై ఈసీకి అన్నాడీఎంకే వివరణ

అడయార్, మార్చి 13: అన్నాడీఎంకే అధికార ఎన్నికల గుర్తు రెండాకుల చిహ్నంపై వివాదం చెలరేగింది. ఈ గుర్తుకు సంబంధించి కోర్టులో దాఖలు చేసిన పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, అందువల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేకు రెండాకుల గుర్తును కేటాయించకుండా స్తంభింపజేయాలని కోరుతూ దిండిగల్ జిల్లాకు చెందిన సూర్యమూర్తి అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈసీకి హైకోర్టు నోటీసు జారీ చేసింది. దీనిపై ఈసీ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. ఈ లేఖకు అన్నాడీఎంకే సమాధానమిచ్చింది. పార్టీతో సంబంధం లేని వారు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారని పేర్కొంది. ఈ విషయంపై అన్నాడీఎంకే న్యాయవాద విభాగం కార్యదర్శి ఇన్బదురై మాట్లాడుతూ... అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, రెండాకుల గుర్తును కూడా ఎన్నికల సంఘం కేటాయించిందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయపోరాటం చేసి ఈ గుర్తును అధికారంగా పొందామన్నారు. కర్ణాటక రాష్ట్రంలో రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసిన ఓపీఎస్ మద్దతుదారులు... ఆయన సంతకంతో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు వ్యతిరేకంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కూడా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పైగా ఈ కేసు కర్ణాటక రాష్ట్రంలో జరుగుతోందన్నారు. ఇలాంటి సంఘటనల ద్వారా ఎన్నికల సంఘమే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి అని, ఆ పార్టీ గుర్తు రెండు ఆకులని తేల్చి చెప్పిందన్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీతో ఎలాంటి సంబంధం లేని సూర్యమూర్తి ఫిర్యాదు చేయడం జరిగిందని, అందువల్ల ఆ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

గురువారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.26

శుక్రవారం : సహర్ : ఉదయం - 4.37



మూడు విభాగాలుగా రాష్ట్ర విద్యుత్ బోర్డు

ప్యారీస్, మార్చి 13: విద్యుదుత్పత్తి పెంచి రుణ భారం నుంచి తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ ఈబీ)ను గట్టెక్కించేందుకు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం, ఆ సంస్థను మూడు విభాగాలుగా విభజించింది. లండన్‌లో ఉన్న ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం, రాష్ట్రంలో ఉన్న 50 ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు, వాటి లాభనష్టాలపై పరిశీలన జరుపుతున్నారు. ఈ సంస్థలు వార్షిక, అర్ధ వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు, ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, ఆదాయం, ఖర్చులు తదితర అంశాలపై టీఎన్‌ఈబీ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఇందులో భాగంగా రాష్ట్రానికి అవసరమైన విద్యుదుత్పత్తి, సరఫరాకు వేర్వేరుగా నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా రాష్ట్రప్రభుత్వం గతనెల 24న టీఎన్‌ఈబీకి అనుమతులు జారీచేసింది. అందులో టీఎన్‌ఈబీ, తమిళనాడు గ్రీన్ విద్యుదుత్పత్తి సంస్థ, తమిళనాడు విద్యుత్ సరఫరా సంస్థ అనే మూడు విభాగాలు ఏర్పడ్డాయి. దీని ప్రకారం 4,320 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సేలం జిల్లాలోని మెట్టూరు, తిరువళ్లూర్ జిల్లాలోని నార్త్ చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రాలు, నిర్మాణ దశలో ఉన్న ఉడన్‌కుడి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్వహణ బాధ్యతలు తమిళనాడు విద్యుదుత్పత్తి సంస్థకు బదిలీ అయ్యాయి. అలాగే, 2,321 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కుంద, కొల్లిమలై జలవిద్యుత్ కేంద్రాలు, ప్రభుత్వ నిర్వహణలోని 41 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ కేంద్రాలు తమిళనాడు గ్రీన్ విద్యుదుత్పత్తి సంస్థకు బదిలీ అయ్యాయి. ఈ విధంగా మూడు విభాగాలుగా టీఎన్‌ఈబీని విభజించడం వల్ల విద్యుదుత్పత్తి పెరగడంతో పాటు రుణ భారం కూడా తగ్గే అవకాశముందని విద్యుత్ శాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.

TANGEDCO

50వ స్థానంలో రాష్ట్ర విద్యుత్ బోర్డు

ఐసిఎఫ్, మార్చి 13: కేంద్ర విద్యుత్ శాఖ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 53 విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక స్థితి, పనితీరు వంటి ఆధారంగా ర్యాంకుల జాబితా విడుదల చేసింది. రాష్ట్ర విద్యుత్ బోర్డు 50వ స్థానాన్ని పొంది సి మైనస్ గ్రేడ్‌లో ఉంది. దేశంలో గుజరాత్, ఆంధ్ర సహా పలు రాష్ట్రాల్లో రెండు, మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ బోర్డు ఉప సంస్థ విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థ మాత్రమే ఈ పనులు చేపడుతోంది. దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరును పరిశీలించి ఏటా ర్యాంకుల జాబితా కేంద్ర విద్యుత్ శాఖ విడుదల చేస్తోంది. ఆ ప్రకారం, విడుదలైన జాబితాలో... మహారాష్ట్ర అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై మొదటి స్థానం, గుజరాత్‌లో పవర్ సూరత్ రెండో స్థానం, అహమ్మదాబాద్ మూడో స్థానంలో నిలిచాయి.

కావేరి జలాలు పొందే తీరుతాం

● మంత్రి దురైమురుగన్



పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, మార్చి 13: కావేరి జలాలు పొందేలా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని, కర్ణాటక ప్రభుత్వం ఎన్ని అడ్డుకట్టలు వేసినా ప్రయోజనం లేదని నీటి పారుదల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. జిల్లా కో-ఆపరేటివ్ శాఖ ఆధ్వర్యంలో కాట్పాడిలో ఏర్పాటు చేసిన కర్పగం పెట్రోల్ బంక్‌ను బుధవారం మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, మండల కమిటీ అధ్యక్షుడు బాబు, పుష్పలత, ఉప మేయర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి చేసినా కావేరి జలాలను విడుదల చేసే ప్రసక్తే లేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొనడం గర్హనీయమన్నారు. కర్నాటకలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేస్తామని ఎలాంటి తిరుకాసులు పెట్టకుండా ప్రకటించిన సందర్భాలే లేవని చెప్పారు. ప్రతిసారీ సుప్రీం కోర్టును లేదా కావేరి నిర్వాహక మండలిని ఆశ్రయించి రాష్ట్రానికి కావేరి జలాలను తెప్పించుకుంటున్నామే తప్ప ఏనాడు కర్ణాటక ప్రభుత్వం సవ్యంగా జలాలను విడుదల చేయలేదని విమర్శించారు. రాజ్యసభలో ఉమ్మడి పౌరసత్వ చట్టాన్ని అన్నాడీఎంకే వ్యతిరేకించి ఉంటే ఆ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేసి ఉండేది కాదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే డీఎంకే అభ్యర్థుల జాబితా ఒకటి, రెండు రోజుల్లో వెల్లడిస్తామని మంత్రి దురైమురుగన్ తెలిపారు.

సమాచార దర్శిని

రాష్ట్రీయ రక్ష వర్సిటీలో అడ్మిషన్లు

ఐసిఎఫ్, మార్చి 13: రాష్ట్రీయ రక్ష విశ్వవిద్యాలయం అనే జాతీయ భద్రత వర్సిటీలో విద్యార్థుల అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. గుజరాత్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ వర్సిటీలో యేటా 1,200 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొందుతున్నారు. ఈ వర్సిటీ శాఖలు అరుణాచలప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్నాయి. వీటిలో యూజీ, పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు ప్లస్‌టూ మార్కుల ఆధారంగా అడ్మిషన్లు చేపడుతున్నారు. బీటెక్ కోర్సులో చేరేందుకు జేఈఈలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. త్వరలో జరుగనున్న అడ్మిషన్లకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

ఉచితంగా బ్రెయిలీ లిపి పుస్తకాలు

ఐసిఎఫ్, మార్చి 13: సెమ్మొళి తమిళ పరిశోధన కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో బ్రెయిలీ లిపితో ముద్రించిన సంఘ సాహిత్య గ్రంథాలు అంధులకు ఉచితంగా అందజేయనున్నారు. పెరుంబాక్కంలో ఉన్న ఈ కేంద్రంలో ప్రపంచంలోనే తొలిసారిగా 13,000 పేజీలు కలిగిన సంఘ సాహిత్యాలను అంధుల కోసం బ్రెయిలీ లిపితో ముద్రించారు. తొల్‌కాప్పియం, సిలప్పదికారం, మణిమేఘలై, తిరుక్కురల్ వంటి 46 గ్రంథాల సూక్తులు వంటివి కూడా ఈ లిపిలో ముద్రించారు. ఉచితంగా పుస్తకాలు పొందగోరే వారు నెం.7845874314లో సంప్రదించవచ్చు.

16న పంగుణి ఉత్సవాలు ప్రారంభం

ఐసిఎఫ్, మార్చి 13: స్థానిక తిరువాన్మియూర్ మరుందీశ్వర ఆలయంలో పంగుణి ఉత్సవాలు ఈనెల 16వ తేదీ ప్రారంభం కానున్నాయి. ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలు 11 రోజులు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 14న గురువారం గ్రామ దేవత సెల్లియమ్మన్ ఊరేగింపు, 15వ తేది రాత్రి వినాయక ఊరేగింపు జరగనున్నాయి. 16వ తేది రాత్రి 9.30 గంటలకు ధ్వజారోహణం, యాగశాల పూజలు, పంచమూర్తుల ఊరేగింపు జరుగుతాయి. 25న త్యాగరాజస్వామి తిరుకల్యాణం, రాత్రి 10 గంటలకు ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్ర వేళల్లో ఉత్సవమూర్తులు వివిధ వాహనాల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

డిప్లొమా పరీక్ష టైంటేబుల్ విడుదల

ఐసిఎఫ్, మార్చి 13: మొదటి, రెండవ సంవత్సరం టీచర్ ట్రైనింగ్ డిప్లొమా పరీక్షల టైంటేబుల్ విడుదలైంది. జూన్ 20వ తేది నుంచి జూలై 9వ తేది వరకు పరీక్షలు జరగున్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలు జూన్ 21 నుంచి జూలై 9వ తేది వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు జూన్ 20 నుంచి జూలై 8 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు. టైంటేబుల్‌ను www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

మేల్‌మరువత్తూర్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

పెరంబూర్, మార్చి 13: పుదుచ్చేరి - కాచిగూడ, పుదుచ్చేరి - కాకినాడ పోర్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గురువారం నుంచి మేల్‌మరువత్తూర్‌లో ఆగుతాయని దక్షిణ రైల్వే తెలిపింది. నెం.17651 పుదుచ్చేరి, కాచిగూడ ఎక్స్‌ప్రెస్ (సోమ, గురు, శుక్రవారాలు) మధ్యాహ్నం 2.33 గంటలకు మేల్‌మరువత్తూర్ చేరుకొని 2.35 గంటలకు బయల్దేరుతుంది. అలాగే, నెం.17643 పుదుచ్చేరి - కాకినాడ పోర్ట్ ఎక్స్‌ప్రెస్ (సోమ, గురు, శుక్రవారాలు) మేల్‌మరువత్తూర్‌కు మధ్యాహ్నం 3.03 గంటలకు చేరుకొని 3.05 గంటలకు బయల్దేరుతుందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

20 వరకు సెకండరీ టీచర్ పోస్టుల దరఖాస్తు సమర్పణ పొడిగింపు

పెరంబూర్, మార్చి 13: వచ్చే విద్యా సంవత్సరం (2024-25) సెకండరీ టీచర్ పోస్టులకు సంబంధించిన దరఖాస్తు సమర్పణ గడువును ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) ఈ నెల 20వ తేది వరకు పొడిగించింది. ఈ నెల 15వ తేదీతో ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణ గడువు ముగియనున్న నేపథ్యంలో, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు 20వ తేది వరకు పొడిగించినట్లు టీఆర్బీ తెలియజేసింది.

ఢిల్లీకెళ్లిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు

ప్యారీస్, మార్చి 13: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు ఆకస్మికంగా దేశ రాజధాని ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. రెండు రోజులు అక్కడే మకాం వేసి పార్లమెంటు ఎన్నికల నిర్వహణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, నిఘా అధికారుల నియామకం, రాజకీయపార్టీలు ప్రకటించే అభ్యర్థుల ప్రచారం, పోలింగ్‌కు అవసరమైన ఈవీఎం, వీవీ పాట్, భద్రతకు సాయుధ పోలీసులతో కలసి పారా మిలిటరీ బలగాలను వినియోగించుకోవడం తదితర అంశాలపై సత్యప్రదసాహు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారులతో చర్చిస్తారని అధికారవర్గాలు తెలిపాయి.

మాజీ సైనికులకు ఊరట

● ఆస్తి, ఇంటి పన్ను చెల్లింపుల నుంచి మినహాయింపు

పెరంబూర్, మార్చి 13: ఆస్తి, ఇంటి పన్ను చెల్లింపుల నుంచి మాజీ సైనికులకు మినహాయింపు కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేసింది. శాసనసభ సమావేశాల్లో ఫిబ్రవరి 19వ తేది ఆర్థిక, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి తంగం తెన్నరసు మాట్లాడుతూ... ఒంటరి మహిళలు, యుద్ధంలో మృతిచెందిన సైనికులు అని కొందరికి మాత్రమే పన్నుల చెల్లింపులపై మినహాయింపు కల్పిస్తుండగా, మాజీ సైనికులందరికీ ఈ మినహాయింపు వర్తింపజేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, అన్ని విభాగాల మాజీ సైనికులు ఆస్తి పన్ను, ఇంటి పన్ను చెల్లింపుల నుంచి మినహాయిస్తూ రాష్ట్రప్రభుత్వం బుధవారం జీవో విడుదల చేసింది. ఈ పథకంలో 1.20 లక్షల మంది మాజీ సైనికులు లబ్ధిపొందనున్నారు.

- మాజీ సైనికులు శాశ్వతంగా రాష్ట్రంలో నివసించే వారై ఉండాలి.
- మాజీ సైనికులు నివసించే భవనాలకు మాత్రమే ఈ మినహాయింపు.
- ఆదాయపు పన్ను చెల్లించే వారికి వర్తించదు
- సైనిక విధుల నుంచి పదవీ విరమణ పొందిన తర్వాత మరో ఉద్యోగ అవకాశం పథకంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వ పనులకు నియమితులైన వారికి వర్తించదు.
- మరో ఉద్యోగంలో పదవీ విరమణ పొందిన వారికీ వర్తించదు.

సెంథిల్ బాలాజి వ్యవహారం

ఈడీ కేసుపై స్టే విధించలేం

● మద్రాసు హైకోర్టు

ప్యారీస్, మార్చి 13: మాజీ మంత్రి సెంథిల్ బాలాజికి సంబంధించిన అక్రమార్జన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆయనపై దాఖలుచేసిన కేసుకు స్టే విధించలేమని మద్రాసు హైకోర్టు తెలిపింది. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించిన సెంథిల్ బాలాజి ఆ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని నమ్మించి పెద్ద మొత్తంలో నగదు పుచ్చుకొని మోసం చేసినట్లు ఆయనకు వ్యతిరేకంగా అవినీతి నిరోధక విభాగం అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసును నగరంలోని ఎంపీ, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నమోదైన కేసుల విచారణ జరిపే ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ స్థాయిలో ఉంది. మంత్రిగా తన అధికారాన్ని సెంథిల్ బాలాజి దుర్వినియోగం చేసి అక్రమంగా సంపాదించారని కారణం చూపి ఆయనకు వ్యతిరేకంగా ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో గత ఏడాది జూన్‌లో అరెస్టయిన సెంథిల్ బాలాజి, తనకు వ్యతిరేకంగా ప్రత్యేక న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ పూర్తయ్యేవరకు ఈడీ కేసు విచారణను వాయిదా వేయాలని చెన్నై ప్రిన్సిపల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఈ పిటిషన్ తోసిపుచ్చిన నేపథ్యంలో, మళ్లీ సెంథిల్ బాలాజి తరఫున గత ఫిబ్రవరి 15న రివ్యూ పిటిషన్ దాఖలైంది. ఈ రివ్యూ పిటిషన్ న్యాయమూర్తులు ఎం.ఎస్ రమేష్, సుందర్‌మోహన్ బెంచ్ సమక్షంలో విచారణకు రాగా, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, ఎస్.ప్రభాకరన్ హాజరై వాదించారు. ఇరుతరఫు వాదనల అనంతరం ఈడీ కేసు ప్రారంభ దశలో ఉన్నందువల్ల విచారణకు ఆదేశించలేమని వివరించిన న్యాయస్థానం, ఏప్రిల్ 25లోపు వివరణ ఇవ్వాలంటూ ఈడీకి ఉత్తర్వులు జారీచేసింది.

దేశానికి సీఏఏ అవసరం

● పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

పుదుచ్చేరి, మార్చి 13: దేశ భద్రత కోసమే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ పేర్కొన్నారు. ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఏఏ వల్ల ఒక్క పౌరుడు కూడా తన హక్కు కోల్పోరని, మతానికి, ఈ చట్టానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. దేశ భద్రత కాపాడే విధంగా ప్రవేశపెట్టిన ఈ చట్టాన్ని కొన్ని రాజకీయపార్టీలు వ్యతిరేకించడమే కాకుడా ప్రచారం సాగిస్తున్నాయని, సీఏఏలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. మంచి ఉద్దేశంతో తీసుకొచ్చిన కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చి మద్దతు ప్రకటించాలని కోరారు. ఒకవేళ మతానికి వ్యతిరేకమైతే కేంద్రప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశపెడుతుందా అని ఆలోచించాలని ఆమె సూచించారు.

వక్ఫ్ భూముల ఆక్రమణలు తొలగించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు వస్తున్న గ్రామస్తులు

వేలూరు, మార్చి 13: పేర్నాంబట్టు తాలూకా ఏరిగుత్తిలో ఆక్రమణలకు గురైన వక్ఫ్ బోర్డు స్థలాలు స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సమాజ సేవకుడు మహమ్మద్ ఇమ్రాన్ నేతృత్వంలో 200 మందికి పైగా గ్రామస్తులు బుధవారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని, కలెక్టర్ సుబ్బలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు.

సమాజసేవకుడు దినేష్ శరవణన్‌కు పురస్కారం



దినేష్ శరవణన్‌కు పురస్కారం అందజేస్తున్న మంత్రులు అన్బిల్ మహేష్, అన్బరసన్

వేలూరు, మార్చి 13: ప్రభుత్వ పాఠశాలల్లో తన సొంత నిధులతో స్మార్ట్ తరగతులు ఏర్పాటు చేస్తున్న వేలూరు రంగాపురానికి చెందిన సమాజ సేవకుడు, ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్‌ను మంత్రులు ప్రశంసించారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల కాంచీ పురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు అన్బిల్ మహేష్, టీఎం అన్బరసన్ ఆయన సేవలు ప్రశంసిస్తూ పురస్కారం ప్రదానం చేశారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ల అందజేత



యజమానులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు, మార్చి 13: నగరంలో చోరీ గురైన సుమారు 150 సెల్‌ఫోన్లను వాటి యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణివన్నన్ మాట్లాడుతూ... జిల్లాలో చోరీకి గురైన 522 సెల్‌ఫోన్లు రికవరీ చేసుకొని, వాటిని యజమానులకు అప్పగించామన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలకు పగడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. మాజీ నేరస్తులను బైండోవర్ చేసుకోవడంతో పాటు జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు ఏర్పాటుచేయనున్నట్లు ఎస్పీ తెలిపారు.

పార్ట్‌టైం రేషన్ దుకాణం ప్రారంభం



రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న జిల్లా పంచాయతి కమిటీ అధ్యక్షుడు బాబు

వేలూరు, మార్చి 13: ఆనైకట్టు నియోజకవర్గం పింజుమందై పంచాయతీ పెరియ శప్పారైలో పార్ట్‌టైం దుకాణం బుధవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. డీఎంకే జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షుడు, అనైకట్టు యూనియన్ సెక్రటరీ బాబు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కత్తిరించి దుకాణం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ ఉప సెక్రటరీ గణపతి, జిల్లా యువజన విభాగం ఆర్గనైజర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.34.67 కోట్లతో సెల్ఫీ పాయింట్

ఐసిఎఫ్, మార్చి 13: స్థానిక తిరువొత్తియూర్‌లో సెల్ఫీ పాయింట్‌తో సముద్రతీర ఆధునికీకరణ పనులు రూ.34.67 కోట్లతో ప్రారంభమయ్యాయి. భారతీయార్‌నగర్ - మస్తాన్ ఆలయం జంక్షన్ వరకు సీఎండీఏ ఈ పనులు చేపట్టనుంది. 1.9 కి.మీ దూరం 28,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పిల్లల క్రీడా, కబడ్డీ మైదానాలు, జిమ్, ధ్యాన మండపం, సోలార్ విద్యుద్దీపాలు, టాయిలెట్లు, సెల్ఫీ పాయింట్, పార్కు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ఏడు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

తిరుప్పూరులో మత్తుమందుల విక్రయం

ఆరుగురి అరెస్టు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరులో మత్తుమందులు విక్రయించిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజులకు ముందు తిరుప్పూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మత్తులో జోగుతూ ముగ్గురు యువకులు చికిత్స నిమిత్తం చేరారు. ఆ సంఘటనకు సంబంధించి పోలీసులు జరిపిన విచారణలో తిరుప్పూరు కాలేజి రోడ్డు, మాస్కోనగర్, పారైకుళి ప్రాంతాల్లో వంటి నొప్పులకు వాడే మాత్రలలో కొన్ని రసాయనాలు కలిపి మత్తుమందుగా కొందరు విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఆ ప్రాంతాల్లో పోలీసులు నిఘా వేసి మత్తుమందులు అమ్ముతున్న మయిల్‌సామి, ఆయన కుమారుడు సతీష్‌కుమార్, మహమ్మద్ ఇక్బాల్, సూర్య నారాయణన్, సూర్య ప్రకాష్, శివకుమార్ అనే ఆరుగురిని అరెస్టు చేశారు.

చెన్నై ఎగ్మూర్-సంత్రాగచ్చి అన్‌రిజర్వుడు రైళ్లు

పెరంబూర్, మార్చి 13: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చెన్నై ఎగ్మూర్ - సంత్రాగచ్చి మధ్య అన్‌రిజర్వుడు రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ● నెం.06077 చెన్నై ఎగ్మూర్ - సంత్రాగచ్చి అన్‌రిజర్వుడు స్పెషల్ ఈ నెల 16, 23, 30, ఏప్రిల్ 6 (శనివారం) రాత్రి 11 గంటలకు ఎగ్మూర్‌లో బయల్దేరి మూడో రోజు ఉదయం 7.15 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. నెం.06078 సంత్రాగచ్చి - చెన్నై ఎగ్మూర్ అన్‌రిజర్వుడు స్పెషల్ ఈ నెల 18, 25, ఏప్రిల్ 1, 8 తేదీలు (సోమవారం) ఉదయం 10 గంటలకు సంత్రాగచ్చిలో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం నార్త్, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, కుర్దా రోడ్డు, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్లలో ఆగనున్నాయి.

సంత్రాగచ్చి రైళ్ల పొడిగింపు.... నెం.06079 చెన్నై ఎగ్మూర్ - సంత్రాగచ్చి స్పెషల్ ఈనెల 19, 26 ఏప్రిల్ 2వ తేదీల్లో (మంగళవారం) మధ్యాహ్నం 1.30 గంటలకు ఎగ్మూర్‌లో బయల్దేరి మూడో రోజు రాత్రి 9 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. సంత్రాగచ్చి - చెన్నై ఎగ్మూర్ స్పెషల్ ఈ నెల 20, 27, ఏప్రిల్ 3వ తేదీల్లో రాత్రి 11.40 గంటలకు సంత్రాగచ్చిలో బయల్దేరి మూడవ రోజు ఉదయం 9 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైనట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

తమిళంలో యూపీఎస్సీ పరీక్షలు

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై డిమాండ్

ప్యారీస్, మార్చి 13: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే పరీక్షలను ఆంగ్లంతో పాటు తమిళంలో నిర్వహించాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై డిమాండ్ చేశారు. నగరంలోని టీఎన్‌సీసీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాము అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, పదేళ్ల పాలనలో విద్యావంతులైన నిరుద్యోగ యువతకు మొండిచెయ్యి చూపారని మండిపడ్డారు. 2012లో కోటిగా ఉన్న నిరుద్యోగ సమస్య 2022లో మూడింతలకు పెరిగిందని, పీహెచ్‌డీ చదువుకున్న 33 శాతం మంది ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. మరోవైపు యూపీఎస్సీ నిర్వహించే పరీక్షలు ఆంగ్లంతో పాటు తమిళంలో కూడా ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఈ డిమాండ్‌ను పరిష్కరింపజేయకుండే నిరుద్యోగ యువతతో కలసి ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.

ఆవలూరు ఆశ్రమంలో వైభవంగా శంఖాభిషేకం



ఒట్టేరి పశుసంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సత్యేంద్రస్వామి

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపం ఆవలూరు ఆశ్రమంలో శ్రీ ఓం పంచశక్తి పీఠాధిపతి శ్రీ ఓం జ్ఞాన సత్యేంద్రస్వామి 56వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రత్యేక హోమం, పరమేశ్వరుడికి అష్టోత్తర శత శంఖాలతో అభిషేకం, గో పూజ ఘనంగా జరిపారు. తొలుత తన గురువు ఆదిసత్యేంద్రస్వామికి స్వర్ణపాదపూజ నిర్వహించారు. అటు పిమ్మట స్థానిక భక్తులు సత్యేంద్రస్వామికి పాదపూజలు జరిపారు. ఈ వేడుకల్లో జనకళ్యాణ్ సుబ్రమణ్యం తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అటుపిమ్మట స్వామీ భక్తులతో కలిసి పెరంబూరు సమీపం ఒట్టేరిలోని పశుసంరక్షణ శాలకు వెళ్లి గోపూజ నిర్వహించారు.

ఎమ్మెల్యేగా పోటీ చేయడం లేదు

● విజయధరణి

అడయార్, మార్చి 13: తాను ఎమ్మెల్యేగా పోటీ చేయడం లేదని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అధిష్ఠానం తనకు ఎంపీ సీటు ఇస్తే మాత్రం కచ్చితంగా పోటీ చేస్తానని ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరిన మహిళా రాజకీయ నేత విజయధరణి తెలిపారు. ఆమె బుధవారం నాగర్‌కోయిల్‌లో విలేకరులతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మరింత బలం చేకూర్చేలా తమ పని తీరు ఉంటుందన్నారు. దేశంలోని సామాన్య ప్రజానీకం ఉన్నత పదవుల్లోకి రావాలని ప్రధాని మోదీ బలంగా కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో మహిళలకు సముచిత స్థానం, గౌరవ మర్యాదలు లేవన్నారు. తనకు కూడా ఏదో ఒక పదవి ఇచ్చి, సముచిత స్థానాన్ని కల్పిస్తుందన్న బలమైన నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎదుగుదలను కోరుకోలేదన్నారు. ఆ పార్టీలో కుటుంబ వారసులకు మాత్రమే పెద్ద పీట వేస్తున్నారన్నారు. కన్నియాకుమారి లోక్‌సభ స్థానం నుంచి కొన్నేళ్లుగా వారసులే పోటీ చేస్తున్నారని, ఏదైనా అభివృద్ధి జరిగిందా? అని ఆమె ప్రశ్నించారు. ఈ స్థానం నుంచి తాను పోటీ చేయాలని కోరుకోవడం లేదని, కానీ పార్టీ ఆదేశిస్తే మాత్రం పోటీ చేస్తానని విజయధరణి తెలిపారు.

అద్దెలు తగ్గించాలని ఆలయ స్థల నివాసుల ధర్నా



ధర్నాలో సీపీఐ నేత ముత్తరసన్, ఆలయ స్థల నివాసుల సంఘం నిర్వాహకులు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో పెంచిన అద్దెను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆలయ స్థల నివాసులు ధర్నా నిర్వహించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆలయ స్థలాల్లో అద్దెకుంటున్నవారి అద్దెలను తగ్గిస్తూ 456/298 ఉత్తర్వును జారీ చేశారని, అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే ప్రభుత్వం ఆ ఉత్తర్వులను బుట్టదాఖలు చేసి అద్దెలను విపరీతంగా పెంచిందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు అమలుపరచినట్లే ఇనామ్ రద్దు చట్టాన్ని సవరించి ఇనాం భూములలో నివసిస్తున్నవారికి, గ్రామనత్తం స్థలాల్లో నివసిస్తున్నవారికి పట్టాలు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఆలయ స్థల నివాసుల సంఘం అధ్యక్షుడు వి.బాలసుబ్రమణియన్, కోశాధికారి ఎస్.ఏళుమలై, జిల్లా విభాగాల నాయకులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, ఎండీఎంకే ఎన్నికల కమిటీ ఇన్‌చార్జి ఆంద్రిదాస్, హిందూ దేవాదాయ ఆలయాల అద్దెల చెల్లింపుదారుల సంఘ ప్రధాన కార్యదర్శి కే.మణి, నిర్వాహక కమిటీ సభ్యుడు శశికుమార్ ప్రసంగించారు. ధర్నాలో సుమారు 700 మంది పాల్గొన్నారు.

మంత్రి ఉదయనిధికి సమన్లు

ప్యారీస్, మార్చి 13: సనాతన ధర్మం గురించి వ్యాఖ్యానించారని రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధికి బిహార్ న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. గత సంవత్సరం నగరంలో రాష్ట్ర లౌకికవాద రచయితలు, కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సనాతన నిర్మూలన మహానాడు జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి ఉదయనిధి పాల్గొని, సనాతన ధర్మం గురించి విమర్శించడం వివాదాస్పదమైంది. బీజేపీ సహా పలు హిందూ సంస్థలు ఉదయనిధికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించాయి. ఆయనపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అదే విధంగా పలు రాష్ట్రాల్లో ఉన్న న్యాయస్థానాల్లో ఉదయనిధిపై కేసులు నమోదయ్యాయి. ఆ మేరకు బిహార్ రాష్ట్రం ఆరా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాది ధరణీధర్‌పాండే కేసు దాఖలు చేశారు. ఈ కేసు విచారణకు రాగా, మేజిస్ట్రేట్ మనోరంజన్‌కుమార్ జా, ఈ వ్యవహారంలో ఉదయనిధి కానీ, ఆయన తరఫున న్యాయవాది కానీ నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని సమన్లు జారీ చేస్తూ కేసు తదుపరి విచారణ ఏప్రిల్ 1కి వాయిదావేశారు.

చట్నీ, సాంబార్ తెచ్చిన తంటా...

హోటల్ ఉద్యోగి దారుణహత్య

● తండ్రి, కొడుకు అరెస్టు

పెరంబూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అదనంగా చట్నీ, సాంబార్ అడిగినందుకు తమపై కసురుకున్న హోటల్ ఉద్యోగిపై దాడి జరిపి హతమార్చిన తండ్రి, కొడుకును పోలీసులు అరెస్టు చేశారు. తాంబరం సమీపం పమ్మల్ మెయిన్‌రోడ్డులో ఉన్న ప్రముఖ హోటల్‌లో తంజావూరుకు చెందిన అరుణ్ (30) పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి అదే ప్రాంతానికి చెందినం పెయింటర్ శంకర్, ఆయన కుమారుడు అరుణ్‌కుమార్ ఆ హోటల్‌కు వెళ్లి ఇడ్లీలను పార్శిల్ కట్టించుకున్నారు. ఆ సందర్భంగా అదనంగా చట్నీ, సాంబార్ కావాలని అడిగారు. పార్శిల్‌కు ఎక్స్‌ట్రా చట్నీ, సాంబార్‌ను ఇవ్వమని హోటల్ ఉద్యోగి అరుణ్ సర్దిచెప్పాడు. దీంతో ఆగ్రహం చెందిన తండ్రీకొడుకులు అరుణ్‌ను చితక బాదారు. ఈ సంఘటనలో అరుణ్ తీవ్రంగా గాయపడి మూర్ఛిల్లాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం క్రోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అరుణ్ మృతి చెందినట్లు ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని శంకర్ ఆయన కుమారుడు అరుణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. శంకర్‌నగర్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. అరుణ్‌కు ఇటీవలే వివాహమైనట్లు తెలిసింది.

సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, మార్చి 13: మాజీ మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్ 26వ సారి న్యాయస్థానం పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు బదిలీ నిషేధ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అరెస్ట్ చేసిన సెంథిల్ బాలాజి స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. తనను ఈ కేసు నుంచి విడిపించాలని కోరుతూ సెంథిల్ బాలాజి తరఫున దాఖలైన పిటిషన్ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజి రిమాండ్ గడువు బుధవారం ముగియడంతో, ఆయనను పుళల్ జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎస్.అల్లి ఎదుట హాజరుపరచగా, ఈనెల 18వ తేది వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

బాంబు బెదిరింపు

పెరంబూర్, మార్చి 13: తిరుపత్తూర్ కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు బాంబు బెదిరింపు కలకలం రేపింది. రెండు కార్యాలయాలకు అందిన లేఖలో.. కార్యాలయాల్లో బాంబులు ఉంచినట్లు పేర్కొన్నారు. దీనిపై అప్రమత్తమైన పోలీసులు కార్యాలయాలు, ప్రాంగణాల్లో పోలీసు జాగిలం, బాంబ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు చేపట్టి, బాంబు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. లేఖ రాసిన వారి ఆచూకీ కోసం పోలీసులు విచారిస్తున్నారు.

రూ.21 లక్షల విలువైన బంగారం స్వాధీనం



గమ్, పౌడర్ రూపంలో బంగారం

పెరంబూర్, మార్చి 13: దుబాయ్ నుంచి మదురైకి వచ్చిన విమాన ప్రయాణికుడి నుంచి రూ.21 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వచ్చిన స్పైస్ జెట్ విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేసిన సమయంలో, ఓ వ్యక్తిని అనుమానించి ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి తనిఖీ చేశారు. అతను లోదుస్తులో గమ్, పౌడర్ రూపంలో తరలిస్తున్న రూ.21,31,640 విలువైన 322 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసున్నారు.

పాఠశాలల సమీపంలో చాక్లెట్ల విక్రయాలపై ఫిర్యాదు చేయండి

ఐసిఎఫ్, మార్చి 13: మత్తుపదార్థాల వినియోగం పెరగడంతో పాఠశాలల సమీపంలో చాక్లెట్, బిస్కెట్ విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఉపాధ్యాయులకు అధికారులు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మత్తుపదార్థాల విక్రయాలను నియంత్రించేలా పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా, విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్ వంటి ప్రాంతాల్లో నిఘా వేశారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పంపిన సర్క్యులర్‌లో.. పాఠశాలల చుట్టుపక్కల ఉన్న దుకాణాలు, టీ స్టాళ్లలో చాక్లెట్ వంటి వస్తువులు విక్రయిస్తుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

వ్యభిచారం వృత్తి...

మహిళ సహా ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, మార్చి 13: నగరంలోని రెండు ప్రాంతాల్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో వ్యభిచార వృత్తి సాగిస్తున్న మహిళ సహా ఇద్దరిని అరెస్ట్ చేశారు. విల్లివాక్కం రాజాజీ నగర్‌లోని వేగవతి వీధిలోని ఓ అపార్ట్‌మెంట్ తనిఖీలు చేపట్టిన వ్యభిచార నిరోధక విభాగం పోలీసులు, అక్కడ వ్యభిచార వృత్తి సాగిస్తున్న అయనావరం చెల్లియమ్మన్ వీధికి చెందిన కుమార్‌ను అరెస్ట్ చేసి, ఇద్దరు మహిళలను రక్షించి ప్రభుత్వ హోంకు తరలించారు. అలాగే, ఎంజీఆర్ నగర్ బుద్ధ వీధిలోని ఓ ఇంట్లో వ్యభిచార వృత్తి సాగిస్తున్న తమిళ్ సెల్వి అనే మహిళను అరెస్ట్ చేసిన పోలీసులు ఇద్దరు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు.

గుట్కా, విదేశీ సిగరెట్ల తరలింపు

114 మంది అరెస్ట్

పెరంబూర్, మార్చి 13: నగరంలోని వివిధ ప్రాంతాల్లో తొమ్మిది రోజుల వ్యవధిలో గుట్కా, విదేశీ సిగిరెట్లు అక్రమంగా తరలిస్తున్న 114 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 4 నుంచి 12వ తేది వరకు చేపట్టిన తనిఖీల్లో గుట్కా, విదేశీ సిగిరెట్లు తరలింపు తదితరాలకు సంబంధించి 95 కేసులు నమోదుచేసి 114 మంది అరెస్ట్ చేశారు. వారి నుంచి 604.2 కిలోల గుట్కా, 41.7 కిలోల మావా, 1,312 ఈ-సిగిరెట్లు, 5,69,800 విదేశీ సిగిరెట్లు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.8.060 నగదు, మూడు ద్విచక్రవాహనాలు, 2 ఆటోలు, సరుకు వ్యాన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

విదేశీ సిగరెట్ల స్వాధీనం

అడయార్,మార్చి13:స్థానిక ఫ్లవర్‌బజార్ ప్రాంతంలోని ఒక గోదాములో అక్రమంగా నిల్వచేసిన రూ.28 లక్షల విలువైన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి గిడ్డంగిలో పనిచేసే వ్యక్తితో పాటు కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఫ్లవర్‌బజార్ అంగప్పనాయకన్ వీధిలోఉన్న ఒక గోదాములో అనుమానాస్పద వస్తువులను కారులో తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆ గోదాములో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు.తనిఖీల్లో విదేశీ సిగరెట్లు ఉన్నట్టు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న గిడ్డంగి యజమాని కోసం గాలిస్తున్నారు. అరెస్టు చేసిన వారిని షావుకారుపేటకు చెందిన ప్రవీణ్ (32), ఎంకేబీ నగర్‌కు చెందిన అబ్దుల్ రహీంలుగా గుర్తించారు.

లంచం తీసుకున్న ఈబీ అధికారి అరెస్ట్

పెరంబూర్, మార్చి 13: ధర్మపురి సమీపంలో రూ.15,000 లంచం తీసుకున్న విద్యుత్ బోర్డు రెవెన్యూ సూపరింటెండెంట్ శశికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంటి విద్యుత్ కనెక్షన్ ఛార్జీలు మార్చాలని వడివేలు అనే వ్యక్తి శశికుమార్‌ను కోరాడు. అందుకు రూ.15 వేలు డిమాండ్ చేయడంతో వడివేలు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం కార్యాలయంలో వడివేలు నగదును శశికుమార్‌కు అందిస్తుండగా అక్కడే మాటువేసిన అధికారులు అతన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు.

ఒడిశా నుంచి గంజాయి తరలింపు

ఒకరి అరెస్టు

అడయార్, మార్చి 13: ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చిన దామోదర్ పటేల్ (28) ని అన్నా నగర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ విభాగం పోలీసులు మఫ్టీలో తనిఖీలు చేశారు. ఆ సమయంలో పెద్ద లగేజీ బ్యాగుతో ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా నిలబడివున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో అతని బ్యాగును తనిఖీ చేయగా, అందులో ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిని బుధవారం ఎగ్మోర్ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

కారులో డ్రైవర్‌కు గుండెపోటు

అడయార్, మార్చి 13: స్థానిక పల్లావరం జీఎస్టీ రోడ్డులో కారును నడుపుతున్న డ్రైవరుకు గుండెపోటు వచ్చి సీటులోనే తుదిశ్వాస విడిచాడు. దీంతో కారు వేగంగా వెళ్ళి సెంటర్ మీడియాను ఢీకొని ఆగిపోయింది. గమనించిన పాదచారులు పోలీసులకు సమాచారం చేరవేశారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని డ్రైవర్‌ను వెలికి తీశారు. ఆ తర్వాత 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడిని అయనావరం ప్రాంతానికి చెందిన బాలసుందర్(55)గా గుర్తించారు. పల్లావరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ కేసు

జాఫర్‌సాదిక్ అలీ స్నేహితుడి అరెస్టు



అరెస్టయిన సదానందం

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో అరెస్టయిన తమిళ సినీ నిర్మాత జాఫర్ సాదిక్ అలీ స్నేహితుడు సదానందాన్ని మాదక ద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు అరెస్టు చేశారు. సాదిక్ అలీ ఆర్థిక వ్యవహారాలన్నింటినీ సదానందం నిర్వహించేవాడని తెలియటంతో తదుపరి దర్యాప్తులో భాగంగా ఆయనను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు ఆయనను ఆగమేఘాలపై ఢిల్లీకి తీసుకెళ్ళారు. ఇదిలా ఉండగా జాఫర్ సాదిక్ అలీ సోదరులు మైదీన్, సలీం పరారీలో ఉండటంతో పోలీసులు లుక్ ఔట్ నోటీసు జారీ చేశారు. రూ.2వేల కోట్ల విలువైన మాదక ద్రవ్యాల అక్రమరవాణా కేసులో ఇప్పటివరకూ జాఫర్ సాదిక్ అలీ సహా ఐదుగురు అరెస్టయ్యారు.



వేలూరులోని డీఎంకే జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీలకు చెందిన 300 మంది పార్టీ జిల్లా సెక్రటరీ, ఎమ్మెల్యే నందకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు.

చిత్రజ్యోతి



'కారా' కోసం విజయ్ సేతుపతి గాత్రదానం

దేశంలోనే తొలిసారి మొసలిని ప్రధాన కథాంశంగా చేసుకుని తెరకెక్కిన చిత్రం 'కారా'. ఈ సినిమాలోని ఓ పాటను ప్రముఖ నటుడు 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి నేపథ్యగానం చేశారు. అచ్చు రాజా మణి స్వరకల్పనలో రూపొందిన ఈ పాట లిరికల్ వీడియోను ఇటీవల విడుదల చేయగా, శ్రోతల నుంచి మంచి స్పందన వచ్చింది. వేసవిలో విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం.. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా వినోదాత్మకంగా తెరకెక్కించారు. ఇందులో మాస్టర్ మహేంద్రన్ హీరోగా నటించగా, సాకీబా బాసి హీరోయిన్‌గా నటించారు.జీవా ప్రతినాయకుడి పాత్రను పోషించారు.ఇతర పాత్రలను మొట్టై రాజేంద్రన్, సేలం వేంగై కే అయ్యనార్ నటించారు.గిరీశన్ ఏసీఏ ఎడిటింగ్ చేయగా,సినిమాటోగ్రఫీని విలియమ్స్ అందించారు. డెబ్యూ డైరెక్టర్ అవతార్ కథ, స్క్రీన్ ప్లేతో దర్శకత్వం వహించారు.

అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే జాగిలం

● కుక్క ప్రధాన పాత్రలో సినిమా

జంతువుల నేపథ్యంలో వచ్చిన అనేక చిత్రాలను తమిళ ప్రేక్షకులు అమితంగా ఆదరించారు. తాజాగా నితిన్ వేముపతి అనే డెబ్యూ డైరెక్టర్ కుక్కను ప్రధాన పాత్రగా చేసుకుని ఒక సినిమాను రూపొందిస్తున్నారు. ఉక్రెయిన్‌లో వైద్య విద్యను పూర్తి చేసిన దర్శకుడు నితిన్... సినిమాపై ఉన్న మక్కువతో వైద్య వృత్తిని వదిలేసి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇప్పటికే మూగ జంతువులను నేపథ్యంగా చేసుకుని అనేక లఘు చిత్రాలను ఆయన తెరకెక్కించారు. ఇటీవల విడుదలై కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న 'మంజుమల్ బాయిస్' తరహాలో ఈ చిత్రం కూడా ఉంటుందని, కొడైక్కెనాల్ నేపథ్యంలో తెరకెక్కించనున్నట్టు తెలిపారు. ఈ సినిమా కోసం 'ఝూన్సీ' అనే పోలీస్ శునకం ప్రధాన పాత్రను పోషిస్తుంది. ఇందులో ఎస్ఏ చంద్రశేఖర్, బాలాజీ శక్తివేల్, వైజీ మహేంద్రన్, శరవణ సుబ్బయ్య, సత్యన్, అయలి మదన్, ఇంద్రజా రోబో శంకర్, జార్జి మరియాన్, కవితా భారతి తదితరులు నటిస్తున్నారు మార్టిన్ టాన్‌రాజ్ సినిమాటోగ్రఫీ అందించే ఈ చిత్రానికి పలు జాతీయ అవార్డులు పొందిన బి.లెనిన్ ఎడిటింగ్ చేస్తున్నారు. కనా ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితంకానుంది. 'సాధారణంగా మనుషులు తమకు జరిగిన అన్యాయంపై పోరాటం చేయడం సహజం. కానీ, తనకు జరిగిన అన్యాయంపై ఓ శునకం ఎలా పోరాడుతుందన్నదే ఈ చిత్ర కథ' అని దర్శకుడు అన్నారు.



పోలీస్ జాగిలం 'ఝూన్సీ'



వివేక్, మెర్విన్ తదితరులు

సింగిల్ ఆల్బమ్స్‌లో వివేక్, మెర్విన్ అదుర్స్

తమిళ సంగీత ప్రపంచంలో సింగిల్ ఆల్బమ్స్ తయారీలో స్వరకర్తలు వివేక్, మెర్విన్ అద్భుతంగా రాణిస్తున్నారు. వీరిద్దరు రూపొందించిన అనేక సోలో ఆల్బమ్స్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. కేవలం సోలో మ్యూజిక్ ఇండస్ట్రీలోనే కాకుండా, సినీ సంగీత రంగంలోనూ తమదైన విలక్షణమైన సంగీతంతో ప్రేక్షకులను ఈ సంగీత దర్శక ద్వయం కట్టిపడేస్తోంది.వారి ప్రత్యేక బాణీలతో సంగీత ప్రియుల్లో ఫాలోయింగ్‌తో పాటు ప్రశంసలు దక్కుతున్నాయి.తాజాగా సంగీత ప్రియులు ఎదురు చూస్తున్న సంగీత సిరీస్ వీఎం ఒరిజినల్స్‌ను పరిచయం చేస్తున్నారు. వివేక్, మెర్విన్ కంపోజింగ్‌లో యువ గాయకులు శివంగి, హర్షవర్ధన్, నిత్యశ్రీ వెంకట రామన్, ఆదిత్య ఆర్కే, ఎంఎస్ కృష్ణ నేపథ్యగానం చేశారం. ఈ ఆల్బమ్‌లో మొత్తం ఐదు పాటలున్నాయి. ఇందులోని తొలి సింగిల్‌ను ఈ నెల 15వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మిగిలిన పాటలను 15 రోజుల వ్యవధిలో విడుదల చేసేలా సన్నాహాలు చేసినట్టు వీఎం ఒరిజినల్స్ సిరీస్ నిర్వాహకులు వెల్లడించారు.

దేవీశ్రీ స్టూడియోలో ఇళయరాజా

● నా కల నిజమైంది: డీఎస్పీ

ప్రముఖ సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్‌ను ఇసైజ్ఞాని ఇళయరాజా సర్‌ప్రైజ్ చేశారు. వడపళనిలోని డీఎస్పీ సంగీత స్టూడియోను ఇళయరాజా మంగళవారం సందర్శించారు. ఈ విషయాన్ని డీఎస్పీ బుధవారం వెల్లడించారు. 'నా జీవిత కల నిజమైంది. నేను చిన్నపిల్లవాడిగా ఉన్నపుడు సంగీతం అంటే ఏమిటో తెలుసుకోకముందే ఇళయరాజా సార్ సంగీతం నాపై అద్భుత మంత్రాన్ని వేసింది. నేను పరీక్షలకు చదువుతున్నపుడు కూడా ఆయన సంగీతం వినేవాడిని. ఇది సంగీత స్వరకర్త కావాలనే దృఢమైన కోరిక, సంకల్పాన్ని నాలో కలిగించింది. నేను మ్యూజిక్ కంపోజర్‌గా మారిన తర్వాత ఒక సంగీత స్టూడియో నిర్మించినపుడు నేను ఇళయరాజా సార్ ఫొటోను పెట్టించా. నా అతిపెద్ద జీవిత కల ఏంటంటే ఇళయరాజా సార్ ఒక రోజు నా స్టూడియోకి రావాలి. అతని చిత్రం పక్కన నిలబడి.. నేను ఫొటో తీసుకోవాలని అనుకున్నా. అది ఎట్టకేలకు నిజమైంది. నా గురువు మాండలిన్ యు శ్రీనివాస్.. ఆయన్ను రప్పించారు. ఇంతకంటే ఏం కావాలి. ఇది నా జీవితంలో అత్యంత భావోద్వేగ ఘట్టాల్లో ఒకటి. నా ప్రియమైన దేవుడికి ధన్యవాదాలు ఇసైజ్ఞాని ఇళయరాజా సర్... మీ దివ్య ఉనికిని నా స్టూడియోలోకి తీసుకొచ్చినందుకు నన్ను నా టీంని ఆశీర్వదించినందుకు, ఎల్లపుడూ మాకు స్ఫూర్తి నిస్తూ, బోధిస్తున్నందుకు ధన్యవాదాలు . లవ్ యూ ఇళయరాజా సర్ అంటూ రాసుకొచ్చారు.



ఇళయరాజాతో దేవీశ్రీ ప్రసాద్

'క్వాడ్రాసెంట్ కన్సల్టింగ్ సొల్యూషన్స్'తో ఈశ్వరి ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురంలోని ఈశ్వరి ఇంజనీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఇటీవల క్వాడ్రాసెంట్ కన్సల్టింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. క్వాడ్రాసెంట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌వీఆర్ మధుకుమార్, ఎస్ఆర్ఎం గ్రూపు రామాపురం గ్రూపు అధినేత డాక్టర్ ఆర్.శివకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. క్వాడ్రాసెంట్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ కింద ఈశ్వరి కాలేజీ విద్యార్థులకు రియల్‌టైం ప్రాజెక్టులలో ఉద్యోగ శిక్షణ అందించడంపై దృష్టి పెట్టడం ఈ అవగాహన ఒప్పందం ముఖ్య ఉద్దేశమని వివరించారు.



ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

భగవతి అమ్మవారి ఆలయంలో కోలాహలంగా ఒడుక్కు పూజ



భగవతి అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్యారీస్, మార్చి 13: కన్నియాకుమారి జిల్లాలో మహిళల శబరిమలగా పేరుగాంచిన మండకాడు భగవతి అమ్మవారి ఆలయంలో మాఘ మాసం ఉత్సవాలు కోలాహలంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 3న ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగునే ఉన్న కేరళ ప్రాంతానికి చెందిన మహిళలు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారు. పదో రోజున 10,000 మందికి పైగా మహిళలు కొత్త మట్టి పాత్రల్లో తేనె, 21 రకాల ఆహార పదార్థాలతో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి 2 గంటల వరకు ఒడుక్కు పూజల్లో (అమ్మవారికి నైవేద్యం సమర్పణ) భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. తెల్లవారుజామున 2 గంటలకు మండకాడు సాస్తాన్ ఆలయం నుంచి పవిత్ర నదులనుంచి 330 పాత్రల్లో సేకరించిన జలాలతో అమ్మవారికి అభిషేకం, 4.30 గంటలకు అడి యంత్ర పూజలు, బుధవారం ఉదయం 6 గంటలకు ముత్తయిదువులు సుమంగళి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు మట్టిపాత్రలతో ఊరేగింపులో పాల్గొన్న సమయంలో రోడ్డుకిరువైపులా బారులుతీరిన ప్రజలు వారిపై పూలు చల్లి స్వాగతించారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా 600 మందికి పైగా పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

విజయ్ పార్టీలో నాజర్ తనయుడు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ తనయుడు నూరుల్ హసన్ ఫైజల్ సినీ నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రిక్కళగంలో చేరారు. ఆ మేరకు ఆన్‌లైన్‌లో సభ్యత్వం పొందారు. 2014లో నూరుల్‌హసన్ ఫైజల్ ఈసీఆర్‌లో కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆ సందర్భంగా విజయ్ ఆయన్ను పరామర్శించారు. అప్పటి నుంచి వీరి మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 8న పయనూరులోని టీవీకే కార్యాలయంలో సభ్యత్వ కార్యక్రమం ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైంది. పదిహేను గంటలలోపే 50లక్షల మంది సభ్యత్వం తీసుకున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తెలిపారు. ఆ సమయంలోనే నూరుల్‌హసన్ ఫైజల్ కూడా ఆన్‌లైన్ ద్వారా పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ విషయాన్ని ఆయన తల్లి కమీలా నాజర్ తన ఎక్స్‌పేజీలో ఓ సందేశంగా వెలువరించారు.



సెల్‌ఫోన్‌లోని సభ్యత్వకార్డు ఫొటోను ప్రదర్శిస్తున్న నూరుల్‌హసన్ ఫైజల్

ఎంజీ మోటార్స్ నుంచి కొత్త కార్లు

అడయార్, మార్చి 13: ప్రముఖ కార్ల తయారీ కంపెనీల్లో ఒకటైన ఎంజీ మోటార్ ఇండియా కంపెనీ మరో కొత్త రకం మోడల్ కార్లను మార్కెట్‌లోకి విడుదల చేసింది. జడ్ ఎస్ ఈవీ ఎక్సైట్ ప్రో పేరుతో తీసుకొచ్చింది. డ్యుయల్ పాన్ పనోరమిక్ స్కై రూఫ్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో మార్కెట్‌లోకి విడుదల చేసిన ఈ కారు ధర రూ.19.98 లక్షలు. అలాగే, ఎంజీ కామెట్ పేరుతో మరో ఫాస్ట్ రీచార్జింగ్ సౌకర్యంతో దీన్ని రూపొందించింది. ఈ కారు ధర రూ.6.98 లక్షలుగా నిర్ణయించింది. ఇందులో డ్రైవింగ్ కన్వీనియన్స్, స్పేషియస్, లగ్జరియస్ ఫ్లష్ ఇంటీరియర్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఇది ఎగ్జిక్యూటివ్, ఎక్సైట్ ప్రో, ఎక్స్‌క్లూజివ్ ప్లస్, ఎస్సెన్స్ మోడళ్లలో అందుబాటులో ఉన్నాయి. వీటి ఎక్స్ షోరూం ధర రూ.18.98 లక్షలుగా ఉందని ఎంజీ ఇండియా మోటార్ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా పేర్కొన్నారు.



ఎంజీ మోటార్ ఇండియా ప్రవేశపెట్టిన కొత్తరకం కారు

క్రైస్తవ మిషనరీల చరిత్ర తెలియని గవర్నర్

● ధర్నాలో ధ్వజమెత్తిన బిషప్‌లు





గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న క్రైస్తవ మతపెద్దలు - ధర్నాలో పాల్గొన్న క్రైస్తవ మతపెద్దలు క్రైస్తవ సోదరులు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మిషనరీల చరిత్ర తెలియని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, దివంగత మత పెద్దలను కించపరిచేలా అసత్యాలను ప్రకటించడం గర్హనీయమంటూ క్రైస్తవ మతపెద్దలు ధ్వజమెత్తారు. తమిళ సాహిత్యానికి, తమిళ ప్రజానీకం అభ్యున్నతికి పాటుపడిన క్రైస్తవ మతపెద్దలు దివంగత కాల్డ్‌వెల్, పియూ పోప్‌ల కీర్తి ప్రతిష్ఠలను దిగజార్చే విధంగా వ్యాఖ్యలు చేసిన గవర్నర్ తీరును ఖండిస్తూ వళ్లువర్ కోట్టం వద్ద క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ఆందోళనలో వివిధ క్రైస్తవ మతాధిపతులు సహా సుమారు రెండు వేలమంది పాల్గొన్నారు. దక్షిణ భారత క్రైస్తవ సంఘం (సీఎస్ఐ) ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన ప్రధాన బిషప్ రూబన్ మార్క్ నాయకత్వం వహించారు. ప్రధాన కార్యదర్శి ఫెర్నాండెజ్ రత్న రాజా, బిషప్‌లు చంద్రశేఖర్, దిమోద్ రవీంద్రన్, బర్నబాస్, చెల్లయ్య, శర్మ నిత్యానంద తదితరులు పాల్గొన్నారు. డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, క్రైస్తవ ఆత్మీ సంఘం సంస్థ ఇనికో ఇరుదయరాజ్ పాల్గొని ప్రసంగించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కాల్డ్‌వెల్ నిరక్షరాస్యుడంటూ గవర్నర్ రవి చేసిన విమర్శలు అసత్యమని నిరూపించేలా ధర్నా వేదికపై కాల్డ్‌వెల్ పొందిన డిగ్రీ పట్టాను ప్రదర్శించారు. 1853లో విక్టోరియా రాణి పాలనలోనే కాల్డ్‌వెల్ డాక్టరేట్ పట్టాను కూడా పొందినట్లు ధర్నాలో పాల్గొన్న క్రైస్తవమత పెద్దలు తెలిపారు. క్రైస్తవ మిషనరీల చరిత్ర ఏమాత్రం తెలియని గవర్నర్ రవి బేషరతుగా క్షమాపణలు తెలుపాలని, లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో చెన్నై డయాసిస్ ఉపాధ్యక్షుడు జ్ఞానాదిక్కమ్, కార్యదర్శి అగస్టిన్ ప్రేమ్‌రాజ్, కోశాధికారి కార్నేలియస్, డీఎంకే సర్వసభ్య మండలి సభ్యుడు ముత్తుసెల్వన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం వర్సిటీలో నేడు మిలన్- 2024 వేడుకల ప్రారంభం

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో మిలన్- 24 పేరుతో 16వ సాంస్కృతిక వేడుకలు గురువారం అట్టహాసంగా ప్రారంభమవుతున్నాయని ఆ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సి. ముత్తమిళ్‌సెల్వన్ తెలిపారు. బుధవారం ఉదయం ఆ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఈ వేడుకలు నాలుగు రోజులపాటు జరుగుతాయని చెప్పారు. గురువారం ప్రారంభోత్సవాల్లో ప్రముఖ గాయని, నటి ఆండ్రియా, సింగర్ ప్రదీప్‌కుమార్ పాల్గొని అలరిస్తారని తెలిపారు. ఇదే విధంగా ఆదివారం ముగింపు వేడుకల్లో నేపథ్య గాయని నీతి మోహన్ పాల్గొంటారని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.పొన్నుసామి, విద్యార్థుల వ్యవహారాల కమిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రిన్స్ కళ్యాణసుందరం, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ నిషా అశోకన్ తదితరులు పాల్గొన్నారు.




మిలన్ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సి.ముత్తమిళ్‌సెల్వన్ తదితరులు



వేప్పేరిలోని వెటర్నరీ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఓ విద్యార్థినికి పట్టాను ప్రదానం చేస్తున్న ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి.

పేదరిక నిర్మూలనతో అద్భుత విజయాలు

పెరంబూర్, మార్చి 13: పేదరిక నిర్మూలనతో దేశం అద్భుత విజయాలు సాధించినట్లు రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ సి.రంగరాజన్ తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ నిజ్వా, సుల్తానేట్ ఆఫ్ ఒమన్, ఎస్ఆర్ఎం, వడపళని క్యాంపస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 'వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న విధానాలు' అనే అంశంపై అంతర్జాతీయస్థాయి సదస్సు జరిగింది.



సదస్సు లక్ష్యాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ముఖ్యఅతిథులుగా ఆర్బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్, బింగ్డన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ పాల్ ఆర్ చియారోట్ల హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. తొలుత ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంఎస్ ప్రభాదేవి స్వాగతోపన్యాసం చేయగా, ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్‌శశిరేఖ సదస్సు లక్ష్యాలు వివరించారు. ఈ సందర్భంగా రంగరాజన్, ఏడు దశాబ్దాలుగా భారతదేశ అభివృద్ధి పరిమాణాలను సోదాహరణంగా వివరించారు. అతిథులను ఎస్ఆర్ఎం అకడమిక్ డైరెక్టర్ ఎస్.రామచంద్రన్, సదస్సు సమన్వయకర్త డాక్టర్‌బి. జయప్రభ సత్కరించారు. సమన్వయకర్త డాక్టర్ వి.సుకన్య వందన సమర్పణతో సదస్సు ముగిసింది.

నాణ్యత, నమ్మకం, పారదర్శకతతో అత్యుత్తమ సేవలు

● 'సదరన్ ట్రావెల్స్' బ్రాంచ్ ప్రారంభంలో వక్తలు





వామ్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణను సత్కరిస్తున్న సదరన్ ట్రావెన్స్ నిర్వాహకులు - కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

చెన్నై, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాణ్యత, నమ్మకం, పారదర్శకతతో అంతర్జాతీయంగా పర్యటకులకు సేవలందిస్తున్నామని సదరన్ ట్రావెల్స్ నిర్వాహకులు ఆలపాటి కృష్ణమోహన్, ఆలపాటి వెంకట ప్రవీణ్ తెలిపారు. పర్యాటక రంగంలో 54 ఏళ్లుగా సేవలందిస్తున్న సదరన్ ట్రావెల్స్ అన్నానగర్‌లో కొత్త శాఖ ఏర్పాటుచేసింది. బుధవారం జరిగిన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా తమిళనాడు పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ప్రత్యేక కార్యదర్శి బి.కృష్ణమూర్తి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా అడయార్ ఆనంద్ భవన్ మేనేజింగ్ డైరెక్టర్ కేటీ శ్రీనివాస రాజా, అజంతా వక్కపలుకుల సంస్థ ఛైర్మన్ డాక్టర్ అజంతా కె.శంకరరావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ, ఆంధ్ర కళాస్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు, జైరాజ్ ఇంటర్నేషనల్ అధినేత టి.రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలపాటి కృష్ణమోహన్, ఆలపాటి వెంకటప్రవీణ్ మాట్లాడుతూ... మూడుతరాలుగా పర్యాటక రంగంలో విశేష సేవలంది స్తున్నామన్నారు. అన్నానగర్‌లో 19వ ఔట్‌లెట్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది తమ టూరిజంలో బుక్ చేసిన వారిని లక్కీ డిప్‌గా ఎంపిక చేసి వచ్చే ఏడాది బహుమతులు అందిస్తామని తెలిపారు. ముఖ్యఅతిథి కృష్ణమూర్తి మాట్లాడుతూ... సదరన్ ట్రావెన్స్ దక్షిణాదికే పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య గ్లోబల్ అధ్యక్షులు తంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ టూరిజం కౌన్సిల్‌లో కృష్ణమోహన్ సభ్యులుగా ఉండడంతో పాటు కేంద్ర పర్యాటక శాఖ నుంచి రాష్ట్రపతి చేతుల మీదుగా 8 సార్లు బెస్ట్ టూరిజం అవార్డులు అందుకోవడం అభినందనీయమని అన్నారు. అజంతా శంకరరావు మాట్లాడుతూ.. తనకు సదరన్ ట్రావెల్స్‌తో 50 ఏళ్లుగా అనుబంధం ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడుతూ... పర్యాటకులకు సౌకర్యవంతమైన, అధునిక వసతులతో కూడిన ప్రయాణం అందిస్తున్న సదరన్ ట్రావెల్స్ మరిన్ని శాఖలతో విస్తరించాలని ఆకాంక్షించారు.



పొల్లాచ్చి సభలో ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

రెండు నెలల్లో 9.33 లక్షలకు తగ్గిన నిరుద్యోగులు

పెరంబూర్, మార్చి 13: జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయాల్లో ఉద్యోగాల కోసం నమోదు చేసుకున్న వారి సంఖ్య, గత రెండు నెలల్లో 9.33 లక్షలకు తగ్గింది. రాష్ట్రంలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో గత డిసెంబరు వరకు 64.13 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. గత నెల 29వ తేది నాటికి, ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో నమోదు చేసుకున్న వారి సంఖ్య 54.81 లక్షలకు తగ్గింది. ఆ ప్రకారం, నమోదు చేసుకున్న వారిలో 9,32,111 మంది ఉద్యోగాలు పొందారు. తాజా లెక్కల ప్రకారం, 18 ఏళ్లలోపున్న వారు 11 లక్షలు, 19 నుంచి 30 ఏళ్ల లోపు కళాశాల విద్యార్థులు 24.13 లక్షలు, 31 నుంచి 45 ఏళ్లలోపుండి ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి ఉన్నవారు 17.22 లక్షలు, 42 నుంచి 60 ఏళ్లలోపున్న వారు 2.39 లక్షలు, 60 ఏళ్ల పైబడిన వారు 6,927 మంది కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో 25.26 లక్షల మంది పురుషులు, 29.55 లక్షల మంది మహిళలు, 285 మంది హిజ్రాలున్నట్లు అధికారులు తెలిపారు.



ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయ తీర్థకొలనులో నిర్వహించిన తెప్పోత్సవంలో ఊరేగుతున్న స్వామివారు



ఎగ్మూరు సిరాజ్ మహల్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటైన ఇఫ్తార్ విందులో పాల్గొన్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి



రాయపురం జోన్ వాల్‌టాక్స్ రోడ్డులో రూ.8.97 కోట్లతో నిర్మించనున్న సామాజిక కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ దయానిధి మారన్, మంత్రి పీకే శేఖర్ బాబు, మేయర్ ఆర్. ప్రియ



తిరువాన్మియూరు మరుదీశ్వరర్ ఆలయంలో పారిశుధ్య సేవకులకు పరికరాలను పంపిణీ చేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు